
www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
బుధవారం | 17 | డిసెంబర్ | 2025 | పేజీలు: 08





# ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

## ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : ఈ నెల 14న జరిగిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఎన్నికైన మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామ సర్పంచ్ బెడుదురు వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ కొమ్మరాజుల నరసింహ వార్డు మెంబర్లను మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ క్యాంపు కార్యాలయంలో వారిని సత్కరించారు. ఎన్నికైన వారు ప్రజలకు చేరువగా ప్రజలకు దగ్గరగా ఉండాలని ప్రజలకు అందుబాటులో ఉండి వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుగట్ల లింగయ్య యాదవ్ మండల కాంగ్రెస్ నాయకులు సూదిరెడ్డి శేఖర్రెడ్డి, రెమడాల శ్రీనివాసు, చింతరెడ్డి సైదిరెడ్డి, మచ్చ వెంకన్న, కరుణాకర్రెడ్డి, చెన్నారెడ్డి, కాసాని శ్రీను, రవీందర్రెడ్డి, రమణ, గాలి జానెడ్డి, గాలి సైదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## కోట విశిష్టతను చాటేలా

# టూరిజం ప్రగతి



### రూ.2 కోట్లతో పనులకు శ్రీకారం

### మంత్రి కొండా సురేఖ

వరంగల్, అక్షిత బ్యూరో: ఖిల్లా వరంగల్ లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోటు పునరుజ్జీవనంలో భాగంగా స్పాంజ్ పార్క్, రాతి కోట చుట్టూ కుడా నిధులు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మోటు నిర్మిత పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరాంరెడ్డి, నగర కమీషనర్ చాహత్ బాచ్ పాయి, స్థానిక37,38 డివిజన్స్ కార్పొరేటర్స్ బోగి సువర్ణ సురేష్, భైరబోయిన ఉమా దామోదర్ యాదవ్ ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఖిల్లా వరంగల్ చరిత్రను కాపాడుతూనే కోట విశిష్టతను పెంపొందించేలా టూరిజం అభివృద్ధి చేసి పర్యాటకులకు కనువిందు ..మిగతా 2లో

# సజావుగా ఎన్నికల ప్రక్రియ

### పకడ్బందీగా పోలింగ్ చేపట్టాలి

### పంచాయతీ ఎన్నికల మండలాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను సందర్శించి లిపోలింగ్ సామాగ్రి పంపిణీ

### కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్‌నగర్, అక్షిత ప్రతినిధి : మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న మండలాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం సందర్శించి పోలింగ్ సామాగ్రి పంపిణీని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ విజయేందిర బోయి పర్యవేక్షించారు. జిల్లాలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి బాలానగర్, జడ్చర్ల, అడ్డాకుల, భూత్పూర్, మూసాపేట్, మండలాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ విధానం, రవాణా ఏర్పాట్లు, తదితర అంశాలను ఆమె సమీక్షించారు. బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ..మిగతా 2లో

## ప్రజలు నచ్చిన అభ్యర్థికి

# ఓట్లు వేసుకోవచ్చు

### పంచాయతీ ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులతో తరలి వెళ్లిన పోలింగ్ సిబ్బంది

### డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్

### జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి, అక్షిత ప్రతినిధి : వనపర్తి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడవ విడత ఎన్నికలు నిర్వహించనున్న 5 మండలాల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణములో సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రజలు తమ అమూల్యమైన ఓటును తమకు ..మిగతా 2లో

# తప్పులకు తావివ్వరాదు

### పటిష్ట భద్రత నడుమ ఎన్నికలు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొండమల్లేపల్లి, అక్షిత ప్రతినిధి : ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పోలింగ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె దేవరకొండలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన డిఆర్సి కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని, పోలింగ్ సిబ్బంది సకాలంలో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను చేరుకొని అవసరమైన ఏర్పాట్లు ముందే చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఎన్నికలలో ..మిగతా 2లో

## ప్రజలు నచ్చిన అభ్యర్థికి ఓట్లు వేసుకోవచ్చు





**మొదటి పేజీ తరువాయి...**

నచ్చిన అభ్యర్థికి వేసుకోవాలని జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం పెబ్బేరు, చిన్నంబావి, వీపనగండ్ల, పానగల్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పరిశీలించారు. మూడవ విడతలో పెబ్బేరు మండలంలో 17 సర్పంచి, 141 వార్డు మెంబర్లు, చిన్నంబావి మండలంలో 16 సర్పంచి, 139 వార్డు మెంబర్లు, వీపనగండ్ల మండలంలో 14 సర్పంచి. 124 వార్డు మెంబర్లు, శ్రీరంగాపూర్ మండలంలో 8 సర్పంచి, 77 వార్డు మెంబర్లు , పానగల్ మండలంలో 26 సర్పంచి, 221 వార్డు మెంబర్లు వెరసి 81 గ్రామ సర్పంచి, 702 వార్డు మెంబర్లకు బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగే పోలింగ్ లో ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవాలని సూచించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీస్ భద్రత కల్పించడం జరిగిందని, ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంతర నిఘా పెడుతూ ఎక్కడైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా లేదా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన లేదా భయభ్రాంతులకు గురి చేసిన వెంటనే కఠినమైన చర్యలు తీసుకునే విధంగా ఎన్నికల అథారిటీ పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. తుది విడత పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు 968 ప్రిసైడింగ్ అధికారులు, 1271 ఒపి.ఓ లు వెరసి 2239 మంది పోలింగ్ సిబ్బంది మంగళవారం మెటీరియల్ తీసుకొని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్ళారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు పెబ్బేర్ మండలంలో, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్య నాయక్ వీపనగండ్ల మండలంలో, ఆర్డీఓ సుబ్రమణ్యం చిన్నంబావి మండలంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పర్యవేక్షించారు. తహసీల్దార్లు, ఎంపీఓలు తదితరులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు

## కోట విశిష్టతను చాటేలా టూరిజం ప్రగతి



**మొదటి పేజీ తరువాయి...**

చేసేలా అభివృద్ధి చేస్తామని అన్నారు. అందులో భాగంగా రాతి కోట చుట్టూ బోటింగ్ తిరిగేలా మోటు పునర్జీవనం చేసి, అలాగే మ్యూజియం ను త్వరలో ప్రారంభం చేస్తామని అలాగే కోటలో టూరిజం, అటవీ డిపార్ట్మెంట్ లతో హరిత హోటల్, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కుడా అధికారులు అజిత్ రెడ్డి, ఏఈ భరత్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, కొత్తపెల్లి శ్రీనివాస్, మడిపల్లి కృష్ణ, దూడయ్య, శ్రీనివాస్, శ్యామ్, చందర్, వీరన్న, రాజేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ఎన్నికల ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి...**

మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. జోన్ వారిగా, రూట్ వారిగా కౌంటర్లు ఏర్పాటు చేశారా, పోలింగ్ సిబ్బంది రిసెప్షన్‌కు ప్రత్యేక కౌంటర్లు ఉన్నాయా, పీఓలు, ఓపీఓల హాజరు, రిపోర్ట్ చేసిన సమయం సక్రమంగా నమోదు చేస్తున్నారా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జడ్చర్ల మండల కేంద్రంలోని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. జానకి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి టైటస్ పాల్ తదితరులు పాల్గొన్నారు. అక్కడ పోలింగ్ సామాగ్రి పంపిణీ ఏర్పాట్లను సవివరంగా పరిశీలించారు.

తదుపరి అడ్డాకుల మండల కేంద్రంలోని








ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. భూత్పూర్, మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. మూసాపేట మండల కేంద్రం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించారు.

రూట్ వారిగా పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు తగిన సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేశారా అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు.,రూట్ వారిగా బస్సులు ఏర్పాటు చేసి ఆయా పోలింగ్ కేంద్రాలకు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పీఓలు పోలింగ్ సామాగ్రి స్వీకరించే సమయంలో అందిన మెటీరియల్ చెక్ లిస్ట్ ప్రకారం చెక్ చేసుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా బ్యాలెట్ బాక్సులు సరిగా పనిచేస్తున్నాయా లేదా పరీక్షించుకోవాలని, బ్యాలెట్ పేపర్లపై ఉన్న గుర్తులను ఫారం-9లోని పోటీ అభ్యర్థుల వివరాలతో సరిపోల్చుకోవాలని సూచించారు. చిన్న తప్పిదం జరిగినా దానికి పీఓ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సామాగ్రి స్వీకరించిన అనంతరం పి. ఓ.లు, ఓ.పి ఓ లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నేడు (డిసెంబర్ 17 ) న పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓ, తహశీల్దార్ లు, ఎంఈఓలు తదితరులు ఉన్నారు

# తప్పులకు తావివ్వరాదు

**మొదటి పేజీ తరువాయి...**

తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, ముఖ్యంగా పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ కంపార్ట్మెంట్ కిటికీలకు దూరంగా ఏర్పాటు చేయాలని, అలాగే సరైన విధంగా వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు.

పోలింగ్ బూత్ లో ముగ్గురు కంటే మించి ఓటర్లు ఉండకూడదని తెలిపారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు తప్పనిసరిగా ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని, లెక్కింపు పూర్తయిన తర్వాత ఎన్నికల ఫలితాలను వెంటనే ప్రకటించాలన్నారు. పోలైన బ్యాలెట్లతో పాటు, పోల్ కానీ బ్యాలెట్లు సైతం పూర్తిగా కాపాడే బాధ్యత స్టేజ్ -2 ఆర్ ఓ లపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె టెండర్ ఓట్ల ప్రాముఖ్యతను, టెండర్ ఓట్ల ప్రక్రియ విధానాన్ని తెలియజేశారు. పోలింగ్ కేంద్రం లే-అవుట్ పరిశీలించిన తర్వాత అతిపెద్ద రెండవ గదిని కౌంటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లకు కౌంటింగ్ టేబుల్ కి మధ్యలో బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్





మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా కౌంటింగ్ పూర్తిచేయాలని, కౌంటింగ్ లో జాప్యం జరిగితే చీకటి పడి తప్పులు జరిగేందుకు ఆస్కారం ఉందని,అందువల్ల కౌంటింగ్ కు సాధ్యమైనన్ని ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రహరీ లేకుంటే తాత్కాలిక కంచె వేసుకోవాలని, సాధ్యమైనంత త్వరగా ఎన్నికలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ పోలింగ్, కౌంటింగ్ లపై సూచనలు చేశారు.

దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డిపిఓ వెంకయ్య, జెడ్పిసిఈఓ శ్రీనివాస రావు, ఇతర అధికారులు ఉన్నారు.

ఈ సందర్భంగా ఆమె పోలింగ్ సిబ్బంది దగ్గరకు వెళ్లి వారితో మాట్లాడడమే కాకుండా బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేయించారు.

అంతకు ముందు ఆర్ డిఓ కార్యాలయంలో 17 న జరగనున్న 3 వ విడత ఎన్నికలకు ఆయా మండలాలకు కేటాయించే జిల్లా అధికారులు, ప్రత్యేకధికారుల, ఎంపిఓల నియామకం పై చర్చించారు.

# పార్టీ పుట్టినప్పటి నుంచి అంజయ్య పార్టీలోనే

**ఎవరి మాట నమ్మొద్దు.. నా మాటే నమ్మండి..**

**అంజన్న లాంటి మంచి వ్యక్తి తెలంగాణలోనే లేడు**

**కొత్త సర్పంచ్ లకు శుభాకాంక్షలు..**

**మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు..**

**షాద్ నగర్ బిఆర్ఎస్ రాజకీయాల్లో కొత్త మలుపు**




**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** గ్రామపంచాయతీ ఎన్నికల పుణ్యమా అంటూ టిఆర్ఎస్ లో బయటపడ్డ గ్రూపు తగాదాలు తాజాగా కేటీఆర్ చేసిన ప్రకటనతో కాక రేపుతుంది. షాద్నగర్ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిలు వేరువేరుగా అభ్యర్థులను బలపరిచారు. ఈ మేరకు గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ రోజే ఇరు వర్గాల విభేదాలు బయటపడ్డాయి. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ఏకంగా వీడియో విడుదల చేసి పలు విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత గెలిచిన సర్పంచులు రెండు వర్గాలుగా వేరువేరుగా మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీని కలిసి కృతజ్ఞతలు తెలుపడంతో విభేదాలు స్పష్టంగా కనిపించాయి. నియోజకవర్గంలోని ఫరూక్నగర్ నందిగామ కొత్తూరు కేశంపేట కొందుర్గు చౌదర్ గూడ మండలాలలో కాంగ్రెస్కు దీటైన పోటీ ఇచ్చిన బీఆర్ఎస్ గ్రూపు విభేదాలతో తల్లడిల్లుతోంది. ఈ క్రమంలో టిఆర్ఎస్ సర్పంచులను తీసుకుని మంగళవారం అంజయ్య యాదవ్ కేటీఆర్ ను కలిశారు ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ

షాద్ నగర్ లో పార్టీ పుట్టినప్పటి నుంచి అంజన్న పార్టీలోనే ఉన్నాడు.. పార్టీని వెక్కిరించే రోజుల్లో జడ్పిటిసిగా గెలిచాడు.. ఉద్యమాలలో ప్రాణం పెట్టి పోరాడాడు.. ఎమ్మెల్యేగా రెండుసార్లు ఘనవిజయాలు సాధించాడు.. ఎప్పటికీ అంజన్నే మీ నాయకుడు... ఐక్యంగా పోరాడండి.. అంటూ మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన సర్పంచులతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఆయన కుమారుడు మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ లు రాజధానికి వెళ్లారు.

**కేటీఆర్ వ్యాఖ్యలతో అవాక్కైన నవీన్ వర్గం**

ఎమ్మెల్సీగా ఎన్నికైన నాటినుండి పార్టీ అధిష్టానం తలలో నాలుకల రాష్ట్ర రాజధాని హైదరాబాదులో జరిగే ప్రతీ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ రెడ్డి వర్గం కేటీఆర్ వ్యాఖ్యలతో కంగుతిన్నట్లయినది

మాజీ మంత్రి కేటీఆర్ వాఖ్యలు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గంలో కలకలం రేపుతున్నాయి. ఇటీవల సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మధ్య జరిగిన వివాదం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో అంజయ్య యాదవ్ పై ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నేరుగా విరుచుకు పడడం కూడా తెలిసింది. ఒకవైపు రానున్న కాలంలో ఎమ్మెల్యేగా టికెట్ పొందేది ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాత్రమేనని ఆయన వర్గం ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో ఇలాంటి వ్యాఖ్యలు అయోమయానికి గురిచేస్తాయని అంటున్నారు.. ప్రస్తుతం రాజకీయంగా ఇది చర్చనీయాంశంగా మారుతోంది.. బిఆర్ఎస్ లో మాత్రం ఈ ప్రకటన దుమారం రేపనుంది.

# కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

**అనిరుధ్ రెడ్డి**





**జడ్చర్ల, అక్షిత ప్రతినిధి :** జడ్చర్ల నియోజకవర్గంలో స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలో నిలబడి సర్పంచ్ లుగా, వార్డు మెంబర్లుగా గెలుపొందిన వారు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ లోకి క్యూ కడుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నాయకత్వంలోనే తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామని ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్ మండలాలకు చెందిన పలువురు సర్పంచ్ లు, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీలోకి చేరగా అనిరుధ్ రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాజాపూర్ మండలంలోని చెన్నవెల్లి, కల్లేపల్లి, నవాబుపేట మండలంలోని లింబ్యా తాండ, కొల్లగుట్ట తాండ, మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ముల గ్రామాల నుంచి ఈ చేరికలు భారీగా జరిగాయి. రాజాపూర్ మండలంలోని చెన్నవెల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ పానుగంటి యాదగిరి, డిప్యుటీ సర్పంచ్ భార్గవి శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు పానుగంటి శంకర్ స్వామి, పిట్టెల శివకుమార్, రాయగడ మణెమ్మ, తిరుపతి రెడ్డి, కే.రమ్యా రెడ్డి, ఆర్.శేఖర్ రెడ్డి, శివలీల ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అలాగే కల్లేపల్లి సర్పంచ్ కాట్రావత్ చందర్, ఉప సర్పంచ్ కుమ్మరి శేఖర్, వార్డు సభ్యులు కాట్రావత్ సుశీలా జానీసింగ్, సీహెచ్ చిన్న, జటావత్ తిరుపతి, కావలి రోజా, నేనావత్ మాధవి, పలుగుగుట్ట తాండా సర్పంచ్ శంకర్ బాబు, కూడా కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అలాగే నవాబుపేట మండలంలోని వెంకటేశ్వర తాండ సర్పంచ్ లింబ్య నాయక్, కొల్లగుట్ట తాండ ఉప సర్పంచ్ రవి అనిరుద్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తమ గ్రామాల సమస్యలను వారు ఎమ్మెల్యేకు వివరించి వాటిని పరిష్కరించడానికి కావాల్సిన నిధులను మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యేకు విజప్తి చేయడంతో వెంకటేశ్వర తాండ అభివృద్ధికి రూ.25 లక్షలు, కొల్లగుట్ట తాండ అభివృద్ధి కి రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేస్తామని అనిరుధ్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. మిడ్జిల్ మండలం వెలుగొమ్ముల గ్రామ సర్పంచ్ సువర్ణ గోవర్ధన్ రెడ్డి , మంగళగడ్డ తాండా సర్పంచ్ చందు నాయక్, ఉప సర్పంచ్ జటావత్ శీను నాయక్ కూడా ఈరోజు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్తగాపార్టీలోకి చేరుతున్న సర్పంఛ్ లు, వార్డు మెంబర్లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు కూడా హాజరయ్యారు. పార్టీలోకి చేరండి, గ్రామాలు అభివృద్ధి చేసుకుందాం

కాగా ప్రస్తుతం పార్టీలో చేరిన వాళ్లే కాకుండా ఇంకా రాజాపూర్, నవాబుపేట, మిడ్జిల్, ఊర్కొండ మండలాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గెలుపొందిన పలువురు సర్పంచ్ లు, వార్డు మెంబర్లు కూడా తమకు టచ్ లో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీలోకి ఈ చేరికల పరంపర కొనసాగుతుందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేసారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనే సత్యాన్ని ప్రజలు గుర్తించారని అభిప్రాయపడ్డారు. కొత్తగా సర్పంచులు గా గెలిచిన వారు కాంగ్రెస్ పార్టీలోకి చేరాలని ఆహ్వానించారు. రాజకీయాల కంటే అభివృద్ధికి తాను ప్రాధాన్యత ఇస్తానని పార్టీలోకి చేరే వారిని మన:స్ఫూర్తిగా ఆహ్వానిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు.

2500

## 21న టాప్రా జిల్లా మహాసభ


**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఈనెల 21న నల్లగొండ జిల్లా టాప్రా మహాసభ జరగనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్ చంద్ర, శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభకు రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి, కార్యదర్శి పి.కృష్ణమూర్తి మాజీ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, టాప్రా నాయకులు జనార్ధన్ రెడ్డి హాజరుకానున్నట్టు వారు తెలిపారు. మిర్యాలగూడలో జరిగే మహాసభ సమస్యలపై చర్చించనున్నట్లు పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకున్నట్టు వారు తెలిపారు. గత 3సంవత్సరాల నుండి సంఘం నిర్వహించిన కార్యకలాపాలను చర్చించి రాబోయేకాలంలో పెన్షనర్ల సమస్యలు పరిష్కారాన్ని ఏ విధంగా నెరవేర్చుకోవాలని, అనేక పెన్షనర్ల సమస్యలు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 5 డిఏలు, పిఆర్సి లేదు, 2024 నుండి రిటైరైన ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఈనాటికీ రానటువంటి పెన్షన్ బెనిఫిట్స్, మెడికల్ రీయంబర్స్మెంట్, ప్రతి జిల్లాలో ఒక వెల్నెస్ సెంటర్ ప్రారంభించాలని, నగదు రహిత ఆరోగ్య కార్డు ఇప్పించాలని, తదితర కోర్కెల మీద కూలంకషంగా చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత మూడు సంవత్సరాల నుండి సంఘము నిర్వహించిన కార్యకలాపాలపై సమీక్ష చేసి రాబోయే కాలంలో తీసుకునే నిర్ణయాలపై ఈ సమావేశం తీర్మానాలు చేస్తుందని తెలిపారు. మహాసభకు జిల్లాలోని సుమారు 200 మంది హాజరుకానునట్టు తెలిపారు. మహాసభలు విజయవంతం చేయాలని కోరారు.

## రంగాపూర్ సర్పంచ్‌ను సన్మానించిన కేటీఆర్



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** మంచి పాలన అందించి అభివృద్ధి సాధించాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు నిచ్చారు. మంగళవారం కేటీఆర్ ను కలిసిన రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం రంగాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గోవు అంజమ్మను కేటీఆర్ అభినందించారు. సర్పంచ్ తనయుడు రవికుమార్ ను కూడా కేటీఆర్ అభినందించి సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు.

## సాయి కుమార్ గౌడ్ గెలుపు సందర్భంగా మొక్కు చెల్లించుకున్న మల్లేష్



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామంలో నూతన సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన కూనూర్ సాయి కుమార్ గౌడ్ భారీ మెజార్టీతో విజయం ఎన్నికలలో సాధించగా గ్రామ దేవత శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామికి, తాను ఎన్నికల సందర్భంగా సాయికుమార్ గౌడ్ గెలవాలని మొక్కుకున్న మొక్కును తెలుసురి మల్లేష్ చెల్లించడం జరిగింది.

# గ్రామపంచాయతీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





**వరంగల్, అక్షిత బ్యూరో:** డిసెంబర్ 17న 3వ విడతలో ఎన్నికలు నిర్వహించే పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ వరంగల్ జిల్లాలో 3వ విడతలో బుధవారం నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను పటిష్టంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.

రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నర్సంపేట మండలంలోని ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో, నెక్కొండ లోని మహేశ్వరి గార్డెన్స్ లో, ఖనాపూర్ లోని జెడ్పిహెచ్ఎస్ లో, చెన్నారావుపేట ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ విధానం, భద్రతా ఏర్పాట్లు, సిబ్బందికి కల్పించిన సౌకర్యాలను వేర్వేరుగా మండలాలవారిగా పరిశీలించి అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు.

పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఓటరు జాబితాలు, ముద్రలు, ఫారాలు తదితర ఎన్నికల సామాగ్రి సమయానికి, పూర్తి స్థాయిలో అందేలా చూడాలని సూచించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ సమయంలో గందరగోళం లేకుండా క్రమబద్ధంగా నిర్వహించాలని, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రాం రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, సుమా, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా నోడల్ అధికారులు ఎం పి డి ఓ లు, తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## 1991 మంది పోలీస్ సిబ్బందితో ఎన్నికల బందోబస్త్

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**వరంగల్, అక్షిత బ్యూరో:** పంచాయితీ రెండవ విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమని ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఈ నెల 17 న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ మండలాల్లో జరిగే మూడవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1991మంది పోలీసులను వినియోగించడం జరుగుతోందని ఇందులో ముగ్గురు డిసిపిలతో పాటు అదనపు డిసిపిలు, ఏసిపిలు16మంది, 29 ఇన్స్పెక్టర్లు,131మంది ఎస్.ఐలు, 120 మంది ఏ.ఎస్.ఐ/హెడ్ కానిస్టేబుళ్ళు 339, కానిస్టేబుళ్ళు 1218, హెూంగార్డ్స్ 258 మంది వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని. ఎన్నిక వేళ అదనపు డిసిపి స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసిపి స్థాయి అధికారిని ఇంచార్జ్గా వుంటారని. రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్.ఐ/ఏ.ఎస్.ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హెూంగార్డులు విధులు నిర్వహిస్తారని,ఓటర్ల లెక్కింపు సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు.ఎన్నిక వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లుగా సమచారం అందితే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

## పంచాయతీ ఎన్నికల సందర్భంగా నిషేధాజ్ఞలు సిపి



**వరంగల్, అక్షిత బ్యూరో:** గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల సందర్భంగా వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు 18 తేది ఉదయం 10 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని సీపీ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈనెల 17న జరిగే మూడవ విడత పోలింగ్ నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధించినట్లు ఆయన పేర్కొన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు



**వరంగల్, అక్షిత బ్యూరో:** రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి ఖానాపూర్, నర్సంపేట, చెన్నారావుపేట్ మండలాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, నర్సంపేట, వరంగల్ ఆర్డీవోలు ఉమారాణి, సుమ, జీఎం ఇండస్ట్రిస్ నరసింహమూర్తి, జిల్లా పశువర్ధక శాఖ అధికారి బాల కిషన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో భారీ చేరికలు

**చిరుమర్తి చేతుల మీదుగా గులాబీ తీర్థం పుచ్చుకున్న కాంగ్రెస్ శ్రేణులు**

**నూతన సర్పంచ్ కునూరు సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ లో సుమారుగా 300 మంది భారీ చేరికలు**





**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన నూతన సర్పంచ్ కునూరు సాయి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారుగా 300 మంది కాంగ్రెస్ శ్రేణులు చిరుమర్తి లింగయ్య చేతుల మీదుగా గులాబీ జీవితం పుచ్చుకున్నారు. దీనికి పూర్తి బాధ్యతలు బిఆర్ఎస్ మండల నాయకులు అంతటి పద్మా రమేష్ గౌడ్ సారథ్యం వహించారు.ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలలో కునూరు సాయికుమార్ గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఎలక్షన్లో మద్దతు తెలియజేయకపోవడంతో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకొని భారీ మెజార్టీతో సర్పంచి బరిలో విజేతగా విజయం సాధించిన సందర్భంగా చిరుమర్తి లింగయ్య కు ఇచ్చిన మాట ప్రకారం గెలుపు సాధించి భారీ జన సందోహంతో మరోసారి కండువా కప్పుకొని తన జన బలాన్ని నిరూపించుకున్నారు అనంతరం మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య శాలువులతో సర్పంచ్ సాయికుమార్, ఉపసర్పంచ్ బై కాని ఉమా మహేష్, వార్డ్ మెంబర్స్, గోగు ప్రమిల రమేష్, మేడి ఆంజనేయులు, నేరడి మానస సురేష్, కడారి పావని పాపయ్య, వనం అండాలు యాదగిరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నాయకులు యువత భారీ ఎత్తున సన్మాన కార్యక్రమం అనంతరం పార్టీ చేరికల కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బిఆర్ఎస్ మండల నాయకులు, అంతటి పద్మ రమేష్ గౌడ్, బద్దుల ఉమారమేష్ యాదవ్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పటిష్టమైన పోలీసు భద్రత

**జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**పోలింగ్ నుంచి ఫలితాల వెల్లడి వరకు పోలీసుల కఠిన పర్యవేక్షణ**

**1300 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భారీ బందోబస్తు**

**పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి రక్షణ 163 బిఎన్ ఎస్ ఎస్ అమలు**

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కఠిన పర్యవేక్షణ**

**ప్రశాంత ఎన్నికల కోసం రాత్రింబవళ్లు విధుల్లో పోలీసులు**



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** గ్రామ పంచాయతీ చివరి ఘట్టం మూడవ విడత ఎన్నికలు జిల్లాలో పూర్తిగా ప్రశాంతంగా, నిర్భయంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసుశాఖ అత్యంత పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. మొదటి, రెండవ విడతల ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగియడంలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రదర్శించిన క్రమశిక్షణ, అప్రమత్తత ప్రశంసనీయమని పేర్కొన్నారు. అదే స్థాయిలో మూడవ విడతలో పెబ్బేరు, పానగల్, వీపనగండ్ల, చిన్నంబావి, శ్రీరంగాపూర్, మండలాలలో మొత్తం 87 గ్రామపంచాయతీలకు గాను 06 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిత మొత్తం 81 గ్రామపంచాయతీలకు 1300 మంది పోలీసు అధికారులు సిబ్బందిచే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ప్రతి ఒక్కరు బాధ్యతతో విధులు నిర్వహించి ఎన్నికల విజయానికి తోడ్పడాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..మూడవ విడత ఎన్నికల సందర్భంగా పోలింగ్, కౌంటింగ్, ఫలితాల వెల్లడి వరకు ఎన్నికల భద్రత అనేది సమష్టి బాధ్యతని విధుల్లో ఉన్న సిబ్బంది సమయస్ఫూర్తితో, అప్రమత్తంగా వ్యవహరించాలని,

పోలింగ్ ప్రారంభం నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి నిమిషం జిల్లావ్యాప్తంగా పోలీసుల కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా 1300 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పూర్తి రక్షణతో పాటు 163 బిఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా బృందాలు, మొబైల్ ప్యాట్రోలింగ్, చెక్‌పోస్టులు నిరంతరం పనిచేస్తున్నాయని వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో సహాయక సిబ్బంది అందుబాటులో ఉంటారని ప్రజాస్వామ్యాన్ని బలపరిచే ఈ కీలక సమయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. శాంతియుత ఎన్నికలు భద్రమైన ప్రజాస్వామ్యం లక్ష్యంగా పోలీసు సిబ్బంది రాత్రింబవళ్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, బాణాసంచాకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.

# ఎన్నికల భద్రతపై రాజీ లేదు

**ఎన్నికలకు పకడ్బందీ పోలీస్ బందోబస్తు**

**ఎస్పీ డా. జి. జానకి షర్మిల**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** భైంసా సబ్ డివిజన్ లో జరుగనున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టామని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు. పంచాయతీ ఎలక్షన్ బందోబస్తు సందర్భంగా జిల్లా ఎస్పీ, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక దిశానిర్దేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో శాంతిభద్రతలు క్షుణ్ణంగా పర్యవేక్షించేలా





బలగాల నియోజకవర్గాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కేంద్రాల వద్ద క్రిటికల్, సాధారణ, అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించి, అదనపు బలగాలను మోహరించినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టంచేశారు.

ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని పోలీసు అధికారులకు, బందోబస్తు సిబ్బందికి తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే దిశగా కట్టుదిట్టంగా పని చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా జి జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు,భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ.లు, ఎస్ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గెలిచిన సర్పంచ్‌ల అభినందన సభ



**అక్షిత న్యూస్ మునగల:** అక్షిత న్యూస్ మునగల మండలంలో సిపిఎం పార్టీ బలపరిచిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డ్ నంబర్ల అభినందన సభలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు. మంగళవారం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్పంచుల ఉప సర్పంచ్ల వార్డ్ నెంబర్ ల అభినందన సభ చందా చంద్రయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని ప్రజలు వివిధ గ్రామాలలో సర్పంచులను, ఉప సర్పంచ్లను స్థానిక గ్రామపంచాయితీ ఎన్నికల్లో సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడం జరిగిందన్నారు. ప్రజలను ఎన్నో ప్రలోభాలకు గురి చేసిన సీపీఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులను అక్కున చేర్చుకుని గెలిపించారని మునగాల మండల ప్రజానీకానికి సిపిఎం పార్టీ మండల కమిటీ ప్రక్షాళన విప్లవ జయజయలు అభినందనలు తెలియజేశారు. గెలిచిన సర్పంచులు ఉప సర్పంచ్లు నీతి నిజాయితీగా ప్రజలకు ఉపయోగపడే కార్యచరణను తీసుకొని పనిచేయాలని గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలని అన్నారు. ఈరోజు గెలిచిన సర్పంచులు చరిత్ర కలిగిన కుటుంబాల నుండి వచ్చిన వారిని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం,షేక్ సైదా, జె విజయలక్ష్మి, మండల కమిటీ సభ్యులు వీరబోయిన వెంకన్న, ఎన్ సైదులు, టి సతీష్ జె కొండారెడ్డి,ఎస్ నరసయ్య, ఆర్ లింగయ్య లతోపాటు, కలకోవా సర్పంచ్ మండవ వెంకటాద్రి, నరసింహుల గూడెం సర్పంచ్ కుంచం ఇందిరా నరసయ్య, నారాయణ గూడెం సర్పంచ్ కాంపాటి వెంకన్న, కొక్కిరేణి సర్పంచ్ దాసరి శ్రీనివాస్, జగన్నాధపురం సర్పంచ్ బొల్లం యమునా లింగరాజు, ఉప సర్పంచ్లు సతీష్, సీతారాములు, మైబు, ఆరె శేఖర్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సర్పంచ్‌లను సత్కరించిన శంకర్ నాయక్



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ లో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో ఆయా గ్రామ పంచాయతీ నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా గెలిచిన సర్పంచ్లను ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మంగళవారం ఆయన ఇంట్లో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేసిన బిజెపి నేత గుండె గణేష్ ముదిరాజ్..



**మియాపూర్ అక్షిత ప్రతినిధి:** నిరుపేదలు, అభాగ్యులు చలి నుండి తట్టుకుని ఉపశమనం పొందడానికి తనవంతు సాయం చేయాలనే ఉద్యేశం తో మియాపూర్ డివిజన్ కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ ప్రతీ సంవత్సరం శీతాకాలం లో రగ్గులు పంపిణీ చేస్తారు. అందులో భాగంగానే ఈ సారి కూడా శేరిలింగంపల్లి నియోజకవర్గం బీజేపీ కాంటెస్టేడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ఆదేశాల మేరకు గణేష్ ముదిరాజ్ మియాపూర్ డివిజన్ పరిధిలోని బి కే ఎన్ క్లేవ్, మియాపూర్ మెట్రో స్టేషన్, రోడ్లపై నిరాశ్రయులైన నిరుపేదలకు, వృద్ధులకు, మహిళలకు, చిన్నపిల్లలకు రగ్గులు పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం తనవంతు సాయంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టి వారికి సాయం చేయాలని నిర్ణయం తీసుకుని ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు చేస్తుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, రెడ్డమ్మ, రామకృష్ణ రెడ్డి, శ్రీను, రాము, గోపాల్ రెడ్డి, శేఖర్, రాములు, నరేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్




**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** గ్రామీణ స్థాయిలోని ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడంతో పాటు, స్థానిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను గుర్తించడమే "ఇన్నోవేషన్ పంచాయితీ" కార్యక్రమం ముఖ్య లక్ష్యం అని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీజీఐసీ) నిర్వహిస్తున్న "ఇన్నోవేషన్ పంచాయతీ" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయిలోని ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడంతో పాటు, స్థానిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను గుర్తించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీజేఐసీ ) ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని గ్రామీణ స్థాయి ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు డిసెంబర్ 20వ తేదీన ఉదయం 10 గంటలకు ఇన్నోవేషన్ పంచాయతీ పేరుతో మహబూబ్నగర్ ఐటి టవర్ లో కార్యక్రమాన్ని నిర్వహించనుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా స్టార్టప్స్, ఇన్నోవేటర్లు, యువ ఔత్సాహికులకు వినూత్న ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆవిష్కరణలకు ఆన్-ది-స్పాట్ వాలిడేషన్, మెంటార్‌షిప్, టెక్నికల్ సపోర్ట్ అందిస్తారని తెలిపారు. రాష్ట్రంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం, యువతలో ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణను దేశంలోని ప్రముఖ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం %జూతీ-ంఱఎవ్‌వశ్రీఖఅస్త్రుఖఉ.స్త్రశీజ.ఱఅ% మెయిల్ ఐడి ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐసి ప్రోగ్రాం లీడ్ రమేష్ గౌడ్, ఐడిసి మేనేజర్ శ్రీకాంత్, ఈడియం వెంకటేష్, డీఎస్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# తల లేని మొండెంలా కొత్త ఉపాధి బిల్లు

### గాంధీని చంపిన గాడ్సే వారసుల్లా కొత్త ఉపాధి బిల్లు



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై మొదటి నుండి కక్ష పూరితంగా వ్యవహరిస్తు%శీ% దని,2005 మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముద్దు,2025 కొత్త బిల్లు వద్దనీ, అందుకు కొత్త బిల్లుకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు,కొత్త బిల్లు కాపీల దగ్ధం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు పిలుపునిచ్చారు.

మంగళవారం స్థానికంగా మాట్లాడుతూ మోడీ ప్రభుత్యం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను రద్దు చేసి,2025 పేరుతో 197 బిల్లును తెచ్చారని ఈ బిల్లు చట్టమైతే ఉపాధి హామీ చట్టం తల లేని మొండంగా తయారు అవుతుందని ఆయన విమర్శించారు. గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వికసిత్ భారత్ 2047 లో భాగం చేస్తూ గ్యారంటీ రోజగార్ , అజీవిక మిషన్ (గ్రామీణ)విబి జి-రామ్,జి-2025 బిల్లు తెచ్చారని అన్నారు.మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎందుకు రద్దు చెయ్యబోతున్నారని..? ఈ చట్టం ఉపయోగం లేదు అనుకుంటున్నారా అని ప్రశ్నించారు.కొత్త చట్టం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం మెరుగు పరిచే చర్యలు ఏమిటి అని వారు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కొత్త బిల్లు ఉన్న ఉపాధిని లేకుండా చేస్తున్నదని, పని దినాలు 125 రోజులకు పెంచుతున్నట్టు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారని,వ్యవసాయ సీజన్ లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు. ఉపాధి హామీ పనులు ఫిబ్రవరి 20 నుండి జూన్ 20 వరకు 75% కు పైగా జరుగుతాయని ప్రభుత్య లెక్కలు చెబుతున్నాయని అంటే వ్యవసాయ పనులు పెద్దగా లేని సమయంలో రైతులకు ఎమ్మెస్పి, పంట పెట్టుబడి నుండి తప్పించు కోవటానికి కదా అన్నారు. ఇప్పటి వరకు 90% ఉపాధి హామీ పనుల నిధులు కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం 10% వాటా దళం ఉండేదని ఇప్పుడు 40 % వాటా రాష్ట్రాలు ఇవ్వాలని చెప్పటం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ఎత్తివేయాలనె కుట్రలో భాగంగానే రాష్ట్రాలపై భారం వెయ్యటమని అన్నారు. ఆధార్ నిబంధన కచ్చితంగా అమలు చేయడం లేదని సుప్రీం కోర్టుకు స్పష్టం చేసి ఇప్పటికే ఉపాధికి ఆధార్ లింక్ , కొలతలతో వేతనాలు ఇస్తూ రెండు పూటల హాజరు, కేవైసీ చట్ట విరుద్ధంగా పెట్టారని ఆందోళనకు చేస్తుంటే ఇప్పుడు బయమెట్రిక్,ఏఐ, జీపీఎస్ ను చట్ట బద్దం చెయ్యటం కంటే పేదలను ఉపాధి హామీ నుండి తొలగించడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. ఇప్పటి వరకూ పంచాయతీలు ప్రధాన పాత్ర ఉన్నదని ఇప్పుడు అన్ని అధికారాలు కేంద్రంకు ఉంటాయని, చివరకు సోషల్ ఆడిట్ కూడా మనుషులు కాకుండా టెక్నాలజీతో చేస్తామని ప్రభుత్వం చెబుతుందని దీని వలన ఉపయోగం ఎవరికి ఉంటుందని అడిగారు.ఉపాధి హామీ నిధులతో ఎస్సీ ,ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం ఇస్తున్న భూముల అభివృద్ధి, కాలనీల అభివృద్ధి, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు,నివాస ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ఉపాధి నిధులు మంజూరు చేస్తూ పనులు చేపట్టడం జరిగిందని ఇప్పుడు వాటి ప్రస్తావనే లేకుండా పోయిందని

ఇలాంటి అనేక అంశాలు ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా అనేకం ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు.

# రవీంద్రభారతిలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం కాంస్య విగ్రహ ఏర్పాటు ఒప్పుకోము

### టీ ఆర్ఎస్(డి) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆంధ్రప్రదేశ్ లో జన్మించి చెన్నైలో స్థిరపడ్డ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా దుర్మార్గమైన చర్య గా టీఆర్ఎస్(డి) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ అభివర్ణించారు.ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం తెలుగు చలనచిత్ర రంగానికి అందించిన సేవలను మరువలేము అదే సందర్భంలో ఆయన జన్మించిన ఆంధ్రప్రదేశ్లో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉంటే స్వాగతించే వాళ్ళం. మన తెలంగాణలో అందెశ్రీ గద్దర్ కొండా లక్ష్మణ్ బాపూజీ అమరుడైన శ్రీకాంతాచారి పోలీస్ కృష్ణయ్య కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తే స్వాగతించే వాళ్ళం. అభినందించే వాళ్ళం. ఆప్యాయంగా గుండెల్లో పెట్టుకునే వాళ్ళమని అన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్ర పెత్తందారీ వ్యవస్థ కొనసాగుతుంది. కాంట్రాక్టులు కూడా ఆంధ్ర వారికి అప్పజెప్పడం జరిగింది. మంత్రి పదవులు కూడా సమైక్యవాదులకే అప్పజెప్పడం జరిగింది. తెలంగాణ వస్తే రామోజీ ఫిలిం సిటీని 1000( వేయి) నాగళ్ళతో దున్నుతామన్నా కెసిఆర్ మాట ఏమైంది? తెలంగాణ వస్తే ఆంధ్ర విద్యా సంస్థలు ఉండవు కేవలం తెలంగాణ విద్యాసంస్థలు ఉంటాయి అని చెప్పిన కేసీఆర్ మాట ఏమైనది అని ప్రశ్నిస్తున్నాం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ సమైక్యవాదుల చేతిలో కీలుబొమ్మగా మారి వారికే ఉన్నత పదవులు ఇవ్వడం జరిగింది. ఆంధ్ర గుత్తాధిపత్యాన్ని చాటి చెప్పడం జరిగింది. అదేవిధంగా తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించకుండా వారికి అన్యాయం చేస్తూ సమైక్యవాదుల చేతిలో గుత్తాధిపత్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందన్నారు.

మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మన నీళ్లు మనకు లేవు. మన నిధులు మనకు లేవు. మన నియామకాలు మనకు లేవు. పైగా మనము సృష్టించిన తెలంగాణ తల్లిని మార్పు చేస్తాం. టీ ఎస్ ను టీజీ గా మారుస్తాము.సమైక్య ఆంధ్రప్రదేశ్ లోనే మన పరిపాలన సాగుతున్నట్లుగా అనిపిస్తుంది. ఇది చాలా బాధాకరమైన విషయం. అందుకే టిఆర్ఎస్ ( డి )పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం కాంస్య విగ్రహాన్ని రవీంద్ర భారతి నుండి తీసివేసి వేరేచోట ఏర్పాటు చేయవలసిందిగా డిమాండ్ చేశారు.

# పల్లె పోరు.. తడిసి మోపెడు..

**గ్రామాల్లో విచ్చలవిడిగా నగదు పంపిణీ**

**అభ్యర్థుల ఖర్చుపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు**

**ఖర్చు చేసి ఓడిన అభ్యర్థుల బాధ వర్ణనాతీతం**



**వలిగొండ/అక్షిత న్యూస్:** సర్పంచ్ ఎన్నికల ఘట్టం చివరి అంకానికి చేరుకుంది. ఇప్పటికే రెండు విడతల్లో సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నిక జరగగా తుది పోరు బుధవారంతో ముగియనుంది అయితే అభ్యర్థుల ఖర్చులపై ప్రస్తుతం జోరుగా చర్చ సాగుతోంది. పరువు కోసం అభ్యర్థులు విచ్చలవిడిగా ఖర్చు చేశారని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ కొనసాగుతోంది. గెలిచిన అభ్యర్థి ఐదేళ్లలో చేసిన ఖర్చు ఎలా తీయాలో అని ఆలోచిస్తుంటే, ఓడిన అభ్యర్థి అప్పులు ఎలా తీర్చాలని మదన పడుతున్నట్లుగా తెలుస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొదటి విడతలో 153 రెండవ విడతలో150 గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు ఎన్నికలు జరిగాయి. ఈ గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు శక్తికి మించి ఖర్చు చేశారన్న టాక్ వినిపిస్తోంది. రూ. లక్ష ల్లో ఖర్చు చేయడమే కాకుండా మద్యం ఏరులై పారింది. వారం, పదిరోజుల పాటు నిత్యం ప్రజల్లో ఉండాల్సి రావడంతో అభ్యర్థుల ఖర్చు తడిసి మోపెడైందని తెలుస్తోంది.

**వలిగొండ మండలంలోని గ్రామపంచాయతీల ఖర్చు..**

మండలాల్లో 37 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. అటుఇటుగా చూస్తే సుమారుగా ఒక్కొక్క సర్పంచ్ అభ్యర్థి రూ 5 లక్షల నుంచి రూ. 10 లక్షలు, చిన్న గ్రామ పంచాయతీల్లోరూ. 10 నుండి15 లక్షలు. కమర్షియల్ గా పిలవబడే మేజర్ పంచాయతీల్లో రూ. 50 లక్షలకు పైగానే ఒక్కో సర్పంచ్ అభ్యర్థి ఖర్చు చేసినట్టుగా రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలా చూస్తే ఎంత లేదన్న మండలంలో సర్పంచ్ అభ్యర్థుల కోట్ల రూపాయల పైమాటే అన్న టాక్ వినిపిస్తోంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మేజర్ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి ఖర్చు రూ. 2.5 లక్షలు, చిన్న పంచాయతీల్లో రూ. లక్షన్నరగా నిర్ణయించింది.

**ఇబ్బడిముబ్బడిగా హామీలు..**

గ్రామాల్లో ఎన్నికల బరిలో నిలబడిన అభ్యర్థులు గ్రామ మేనిఫెస్టో తయారు చేసి ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చేశారు. గెలిస్తే ఫలానా పనులు చేసి పెడతామని రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా దాదాపు అన్ని పార్టీల మద్దతుదారులు ప్రజలకు హామీలు గుప్పించారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పంచాయతీలకు నిధులు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిధులు వస్తే అంతో ఇంతో వెనకేసుకునే అవకాశాలు ఉన్నాయని.. రాకపోతే పరిస్థితి ఏమిటనే చర్చ సాగుతోంది. కొంతమంది అభ్యర్థులు ఆస్తులు ఉండి అమ్ముకుని ఎలాగైనా గ్రామ సర్పంచ్ పీఠం కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరారు. మరికొందరు ఐదేళ్లలో పేరు ప్రఖ్యాతులతో పాటు కాస్తోకూస్తో సంపాదించుకోవచ్చని సర్పంచ్ గిరి బరిలో దిగారు.

**ఓడిన వాళ్ల పరిస్థితి..**

వలిగొండ మండలంలో ఒక్కో గ్రామ పంచాయతీకి దాదాపు ముగ్గురు,నలుగురు మరి పులిగిల్లలో నైతే ఏకంగా ఏడుగురు అభ్యర్థులు ఎక్కడ కూడా ఖర్చుకు వెనకాడలేదు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా.. అభ్యర్థులు తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి, ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టారు. పొలం, ఇతర స్థలాలు అమ్మకానికి పెట్టి డబ్బు సమకూర్చుకుని మరీ పోటీలోకి దిగారు. తీరా ఓటమి పాలైన వాళ్లు అప్పులెలా తీర్చాలో తెలియక ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు.

**అభ్యర్థుల ఖర్చు వెల్లడిపై అనుమానాలు**

ఎన్నికల ఖర్చుపై ఈసీ నిబంధనలు పెట్టింది. అయినా కూడా ఎక్కడా ఈ నిబంధన అమలు కాలేదని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఎన్నికలు ముగిశాక పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను ఎన్నికల కమిషన్ కు నివేదించాల్సి ఉంటుంది. గతంలో పోటీ చేసిన అభ్యర్థులు ఇప్పటివరకు ఖర్చుల వివరాలు వెల్లడించలేదని తెలుస్తోంది. ఒకవేళ ప్రస్తుత అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను వెల్లడిస్తే చేసిన రూ. లక్షల ఖర్చును కమిషన్ కు వివరించే అవకాశం లేదని సమాచారం. ఉమ్మడి జిల్లాలో ఈనెల 17న మూడోవిడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రాంతాల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు మరో రూ. 10కోట్ల వరకు పెరిగే అవకాశం ఉన్నదని తెలుస్తోంది

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన నిర్మల్ పోలీస్

**విధుల్లో అప్రమత్తత చూపిన బ్లూ కోల్ట్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు హవర్గ గ్రామస్తుల నుండి సమాచారం అందింది. వెంటనే స్పందించిన విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని, రెస్క్యూ చేసి సకాలంలో ఆ వ్యక్తిని రక్షించారు. అనంతరం పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అవసరమైన సహాయ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్, బ్లూ కోల్ట్ సిబ్బంది చూపిన అప్రమత్తత, మానవత్వాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

## ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణంలో మహిళలకు ఉపాధి కోర్సులు

**ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణ అధికారి వేల్పుల విజేత**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణం లో యువతకు ఉపాధి కోర్సులతో స్వయం ఉపాధి ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నామని యువత సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణ అధికారి వేల్పుల విజేత ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు క్రింది పేర్కొన్న శిక్షణా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణలు పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఈ క్రింది శిక్షణా కోర్సులు త్వరలోనే ప్రారంభించబడుతున్నందున అర్హత కలిగిన అభ్యర్థులు జిల్లా మహిళా ప్రాంగణ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

**శిక్షణా కోర్సులు- అర్హతలు-వ్యవధి**

1. కమ్యూనిటీ హెల్త్ వర్కర్ -2 నెలలు -10వ తరగతి ఉత్తీర్ణత
2. కంప్యూటర్-2 నెలలు- 10వ తరగతి ఉత్తీర్ణత
3. టైలరింగ్ -2 నెలలు-8వ తరగతి ఉత్తీర్ణత
4. బ్యూటీషియన్- 2 నెలలు - 8వ తరగతి ఉత్తీర్ణత.

కావున పై పేర్కొన్న శిక్షణా కోర్సులకు హాజరయ్యేందుకు ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా మహిళా ప్రాంగణం ఖమ్మం నందు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా ప్రాంగనాధికారిణి వేల్పుల విజేత ఒక ప్రకటన లో తెలియజేశారు. అదనపు వివరాల కోసం జిల్లా మహిళా ప్రాంగణ కార్యాలయాన్ని ప్రత్యక్షంగా సంప్రదించలన్నారు.

## అజం జాహి మిల్లు కార్మికులకు
# మార్చి31 లోపు భవనం నిర్మాణం చేపట్టాలి

**అఖిల పక్ష పార్టీల డిమాండ్**






**వరంగల్, అక్షిత బ్యూరో:** ఆజం జాహి మిల్లు కార్మిక భవనాన్ని పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గంగుల దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అఖిల పక్ష పార్టీల,సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు.తో పాటు పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఆనాడు ఓట్ల కోసం,అధికారం లోకి రావడం కోసం ప్రస్తుత ముఖ్యమంత్రి%ఓ% ఆనాటి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి గారి చేత పోస్ట్ ఆఫీస్ దగ్గర అజం జాహి మిల్లు కార్మికులకు న్యాయం చేస్తారని కలబోలు మాటలు చెప్పిపిచ్చి గద్దెనెక్కి అధికారంలోకి వచ్చాక ఈ భవన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల తరపున వచ్చి శంకుస్థాపన చేసి మరల కార్మికుల కోసం కార్మిక భవనాన్ని నిర్మిస్తామని మాజీ ఎమ్మెల్సీ,ప్రస్తుత వరంగల్ తూర్పు ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి ప్రకటించి సంవత్సర కాలం గడిచిపోయిందన్నారు.

ప్రకటనలు, హామీలే తప్ప ఇప్పటివరకు కార్మికులకు భవన నిర్మాణం పై మరియు వారికి కేటాయించిల్సిన ప్లాట్ పైన ఎలాంటి స్పష్టమైన ఫలితం కనిపించడం లేదని తీవ్రంగా విమర్శించారు.

మార్చి 31 తేదీలోపు కార్మిక భవనం నిర్మాణం చేపడతారా నూతనంగా ఏర్పాటు చేస్తున్న కలెక్టర్ ఆఫీస్ పక్కనున్న ప్రభుత్వ భూమిలో 318 మంది కార్మికులకు ఫ్లాట్లు కేటాయించాలనీ, లేకపోతే మేము కార్మికులే చందాలు వేసుకునీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి నిర్మాణం చేపడతామన్నారు. ఈ అంశాలపై స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సహనాన్ని పరీక్షించే విధంగా స్థానిక ఎమ్మెల్యే వ్యవహరించకూడదని, మార్చి 31లోపు స్పష్టమైన చర్యలు లేకపోతే అఖిలపక్షాలు కలిసి తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతాయని హెచ్చరించారు.

మర్చి 31 లోపు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేయకపోతే కచ్చితంగా కార్మికులకు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేయిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ,మాజీ మేయర్ డా,టి రాజేశ్వర్ రావు,మాజీ ఎంపీ సీతారామనాయక్ మాజీ ఎమ్మెల్యేలు వివిధ పార్టీల నాయకులు వివిధ సంఘాల నేతలు కార్మికులు పాల్గొన్నారు

